
# జనవరి నెల ప్రేమ



227

డా॥ వి. చంద్రశేఖరరావు



జనవరి ఎనిమిది.. ఆమె జీవితంలో ముఖ్యమైన రోజు. పనుల ఒత్తిడిలోనూ ఆ వేళకు ఆమె 'చిలకా' వచ్చి తీరుతుంది. చలికాలపు ఉదయపు మంచులో 'బాలూగావ్ రైల్వేస్టేషన్'లో దిగి, ఆటోలోనో, టాక్సీలోనో చిలకా సరస్సు ఒడ్డునున్న టూరిస్టు డిపార్టుమెంటు వాళ్ల కాటేజీలో చేరుతుంది. ఇంకా నిద్రలేవని సరస్సు ఎదురుగా కూర్చుంటుంది. ఆమె ఉన్న కాటేజి. ఎ.సి. గది. సరస్సును చూడడానికి వీలుగా అద్దాల కిటికీలు. ఉదయం అవుతూనే, అద్దాల్లోంచి సూర్యుడు నిద్రలేస్తున్న దృశ్యాన్ని చూస్తుందామె. వెచ్చటి రగ్గును కప్పుకొని సరస్సువైపే చూస్తుంది. కిటికీ అద్దాలపై గుంపులుగా నీలిరంగు పిట్టలు. పొడవాటి ముక్కలతో అద్దాలపై టక్‌టక్‌మని పొడుస్తూ.

ఆ పిట్టలు మృదువైన మెడలు, పొడవాటి నీలిరంగు ఈకలు, వెలుగును చిమ్మే కళ్లతో కిటికీ అద్దాల్లోంచి ఆమె వైపే చూస్తాయి. ఆమె బద్ధకంగా లేచి, స్నానంచేసి, చీర కట్టుకొని, కాఫీతాగి, బయటకు అడుగుపెట్టగానే.. ఆమె చుట్టూ మూగి, వలయాలు వలయాలుగా గిరికీలు కొట్టి, ఆమె హుష్, హుష్ అని అదిలిస్తున్నా, ఆగక ఆమెను పలకరించినట్లుగా;

సరస్సు తాలూకు సౌందర్య విభ్రమ నుంచి విడివడి, సరస్సు పక్కనున్న రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుందామె. రోడ్డు పొడవునా కొబ్బరిచెట్లు. చెట్లపై వెండిపూవుల్లా సూర్యకిరణాలు. ఆ ఉదయపు వేళ నల్ల రంగు చీరలో.. రెండు మైళ్ల దూరం నడిచి, సరస్సు ఒడ్డునే ఉన్న 'ఛిన్న మస్క' అమ్మవారి ఆలయానికి వెళ్తుంది. గుడి ముందరనున్న పూలకొట్లలోని ఆడవాళ్లు, ఆమెను గుర్తుపట్టినట్లుగా నవ్వుతారు. పూలసజ్జ, టెంకాయతో గుడిలో ప్రవేశించింది. పూజారి కూడా ఆమెను గుర్తుపట్టాడు. పదేళ్ల క్రితం, చనిపోయిన ఆమె భర్త కోసం,

భర్త ఆత్మ కోసం పూజలన్నీ చేస్తాడు. నిజానికి ఆమెకు దేవుడన్నా, గుడన్నా నమ్మకం లేదు కానీ, ఈ పూజలు చేయటం ఆమెకో ప్రియ మైన సెంటిమెంటు. మధ్యాహ్నం గుడి ఆవరణలో ఉన్న సాధువులకు, బైరాగులకు, ఆకలితో గుడి ముందర కూర్చున్న వాళ్లకు భోజనాల కోసం పూజారికి అవసరమైన డబ్బు ఇస్తుంది. గుడికి ఫర్లాంగు దూరం లో ఉన్న భర్త సమాధి దగ్గరకు వెళ్లి, దీపం వెలిగించి, పూలతో అలం కరించి, ఆ సమాధి పక్కన పది నిముషాలు కూర్చుం టుంది. అంతటి తో చిలకాకు ఆమె వచ్చిన పని అయిపోతుంది. పదేళ్ల క్రితం చిలకా సరస్సుకు వాళ్లిద్దరు విహారానికి వచ్చినప్పుడు, సరస్సు మధ్యలో గుండె ఆగిపోయి చనిపోయిన భర్త జ్ఞాపకాల కోసం, ఆ జనవరి ఎనిమిదిన, ప్రతి సంవత్సరం, ఈ యాత్రను చేస్తుందామె.

ఉదయం పదకొండు గంటల సమయంలో, సరస్సు ఒడ్డున పడవ కోసం ఎదురుచూస్తూ నిలబడిందామె. 'ఆసియాలో కెల్లా అతి పెద్ద బాక్‌వాటర్ లెగూన్. దాదాపు 11,000 కిలోమీటర్ల నిడివి. వంద లాది నీటిపిట్టలు-' ఆమె పక్కనే నిలబడి గైడ్, ఆమెను విసిగిస్తు న్నాడు. ఆమె గైడ్‌ను పట్టించుకోకుండా సరస్సు మనోహరాలను ఫొటో లుగా తీస్తోంది. ఈ దృశ్యాలన్నీ ఆమెనో మనోహరమైన జ్ఞాపకంలోకి తీసుకెళ్లాయి. దీపోత్సవంలా ఉన్న ఒకరాత్రి, ఆమె పట్టుచీరలో మెరిసి పోతూ, చిలకా ఒడ్డున, భర్త పక్కనే కూర్చున్న క్షణాలు ఆమెకు గుర్తు కొచ్చాయి. అతని ఒడిలో పడుకొని, మధురమైన సంగతులేవో చెప్పు కొన్న రోజు గుర్తు కొచ్చింది. ఆమె భర్త విజయనగరం జిల్లాకు చెందిన బ్రాహ్మల కుర్రాడు. ఆమె హైదరాబాద్‌కు చెందిన రెడ్ల అమ్మాయి. అతనిలో కాస్త సనాతనత్వపు చాదస్తం. ఆమెలో నిర్భయం లాంటి, విశృంఖలంలాంటి పొగరు. అతని కళ్లు బెరుకుగా, మిణుక్కుమనే లాంతరు దీపాలు. ఆమె కళ్లు మోహ వివశత్వంతో భగ్గుమనే వెన్నెల దీపాలు. ఆమె భర్తకు చిలకా సరస్సు అంటే ప్రత్యేకమైన ఇష్టం. వాళ్ల హనీమూన్ ఇక్కడే జరగాలని అతని కోరిక. మొదటిచూపులోనే చిలకా అంటే ఇష్టం కలిగింది ఆమెకు.





ఆమె కోసమే ఏర్పాటుచేసిన బోటు వచ్చింది. గైడ్ తోడురాగా పడవ ఎక్కింది. మంద్రంగా ఉంది సరస్సు. గుంపులు గుంపులుగా పక్షులు. నీటిని ముద్దాడుతూ, నీటిని రాసుకుంటూ మనోహరమైన విన్యాసాలు చేస్తున్నాయి పక్షులు. గూడకొంగలవి. దూరం నుంచి, ఉండీ ఉండీ ఎక్కడినుంచో ఒక పాట, చ్రిప్, చ్రిప్... మంటూ.

నిద్రిస్తున్న నీటిపై కలల గాయంలా వెళుతోంది పడవ. ఆమెకు తెలియకుండానే ఆ దృశ్యపు అందంలోకి ఒదిగిపోయింది. హఠాత్తుగా సరస్సుపై నల్లటి నీడ ఏదో.. సరస్సు నల్లటిముద్దలా మారింది. నల్లటి పెనుమబ్బు సరస్సుపై మూగింది. అలల తీవ్రత పెరిగింది. ఆమె మూడ్‌లో మార్పు వచ్చింది. ఇట్లాంటి ఒక పడవ ప్రయాణంలోనే ఆమె భర్త చనిపోయాడు. గుండెపోటు వచ్చింది. సరస్సు మధ్యలో ఉన్నారు వాళ్లు. వెనక్కు తిరిగివచ్చి, డాక్టరు దగ్గరకు తీసుకెళ్లే లోపలే అతను చనిపోయాడు. గుండెపోటు రావడానికి కొన్ని నిమిషాల ముందు వాళ్లు తీవ్రంగా పోట్లాడుకున్నారు.

"నన్నింక వెనక్కు తీసుకెళ్లు."

"ఇప్పుడా, సరస్సు లోపలికి ముప్ఫయి కిలోమీటర్ల దూరం వచ్చాం."

"నేను వెళ్లిపోవాలి."

"తారా! నా మాట విను."

"నేను అలసిపోయాను. విసుగుతో చచ్చిపోయాను. శవంలా సరస్సుపై తేలాడలేను."

"నువ్వు వెళ్లడానికి వీలులేదు."

"ఈ నీళ్లలో జీవం లేదు. ఉత్సాహం లేదు. నేను వెళ్లాలి."

"నథింగ్ డూయింగ్."

"గోటు హెల్, అండ్ ఐ హేట్ యు."

పడవ 'నలబన' వరకు వెళ్లింది. అంతసేపూ వాళ్లు పోట్లాడు కుంటూనే ఉన్నారు. ఫ్లెమింగో పక్షులన్నీ ఒక్కసారి పడవను చుట్టు

ముట్టిన సమయంలో, అతనికి గుండెపోటు వచ్చింది. పడవను వెనక్కు తిప్పారు. వెనక్కు వెళ్లాలంటే మూడు గంటల ప్రయాణం. ఆ లోపలే అతను చనిపోయాడు. అతడు బాధతో విలవిలలాడిన ఆ దృశ్యాలు, ఆమెకింకా కళ్లముందే జరిగినట్లుగా గుర్తుకొచ్చాయి. గాయాన్ని కెలుక్కొని, ఆ బాధను పదేపదే గుర్తుచేసుకొని, ఆమెకు అదో సంతృప్తి.

పడవ సరస్సులో చాలా దూరం వెళ్లింది. 'సతపద' ప్రాంతంలో చాలాసేపు ఆపాడు పడవను గైడ్. ఆ ప్రాంతం 'డాల్ఫిన్'లకు ప్రసిద్ధి. ఒక్కసారిగా నీళ్లలోంచి పైకి ఎగిసే డాల్ఫిన్‌లవైపు ఇష్టంగా చూసింది ఆమె. పడవ అంచుపైన కూర్చుని, చాలాసేపు నుంచి 'శాండ్‌పైపర్' పక్షి, ఆమెనే వెంబడిస్తూ వస్తోంది. దాన్ని తెలుగులో ఏమంటారని గైడ్‌ని అడిగింది. 'ఏటిగట్టు పిట్ట' అని చెప్పాడు. పడవ బ్రహ్మపుత్ర ప్రాంతానికి వెళ్లేసరికి వానజల్లు మొదలైంది.

బ్రహ్మపుత్ర ప్రాంతంలో ఆమెకు మరో టూరిస్టు పరిచయం అయ్యాడు. అతని కళ్ల చుట్టూ వెడల్పాటి నల్ల కళ్లజోడు. అతని పక్కనే వాకింగ్ స్టిక్. అతను గుడ్డివాడు. పక్కనే అతనికి సహాయంగా ఒక కుర్రవాడు. ప్రతి విషయాన్ని వివరించమని గైడ్‌ని విసిగిస్తున్నాడు అతను. సరస్సులో ఏ చిన్న అలజడి అయినా, అదేమిటో వివరించమంటున్నాడు. క్వేక్... క్వేక్ అని అరుచుకుంటూ వెళ్లే నీటి పక్షుల రూపాన్ని వివరించమని, నీటిపై తపస్సులాగా నిలబడ్డ పెలికాన్‌ల రెక్కల గురించి చెప్పమని. ఆమె ఆశ్చర్యంగా అతనివైపే చూస్తోంది. అతని చేతిలో పొలరాయిడ్ కెమెరా ఉంది. పక్షులు ఎటువైపు ఉన్నాయో చెప్పమని అడిగి, ఆ వైపుకు కెమెరాను తిప్పి, ఫొటో తీస్తున్నాడు. ఫొటో బయటకు రాగానే, ఫొటోను గైడ్ కిచ్చి, ఫొటోలోని దృశ్యాన్ని వివరించమని అడుగుతున్నాడు. చిలకా సరస్సులో చూడవలసిన మరో అద్భుతం ఈ మనిషే అనుకుందామె.

సాయంకాలమైంది. సూర్యుడు పశ్చిమంలో జారిపోయే సమయం. సూర్యుడు, ఎటువైపు ఉన్నాడని గైడ్‌ని అడిగాడు.





కెమెరాను అటు తిప్పి, ఆమె విస్మయంగా చూస్తుండగానే, తీసిన ఫొటోని గైడ్ చేతికిచ్చి ఫొటోలో సూర్యుడు ఎలా ఉన్నాడో చెప్ప మన్నాడు. ఫొటోలో సూర్యుడు లేడు. సరస్సు మాత్రమే ఉంది. "రేపు ఇక్కడంతా వాన, సూర్యుడు రేపంతా కనబడడు" అన్నాడు, ఫొటో లోని వివరాలు విన్నాక. ఆమె ఇంకా ఆశ్చర్యంలోనే ఉంది. ఆమె ఉనికిని గమనించి 'నా పేరు ఎస్.ఎస్. సత్యసుందరం. నేను భవిష్యత్తును తెలిసినవాడిని, చెప్పగలవాడిని" అన్నాడు. యాభైయేళ్ళ ఆ గుడ్డిమనిషి, ఆమెకో ఆకర్షణ అయ్యాడు. తన మూడీనెస్‌ను, దిగులును వదిలి, అతనితో గడపటం, అతని కబుర్లు వినడం, ఆమెకు ఇష్టంగా మారింది.

రాత్రికి తన కాటేజ్‌కి డిన్నర్‌కు రమ్మని ఆహ్వానించాడు సత్య సుందరం. అతని కాటేజ్ ప్రత్యేకంగా ఉంది. ఫర్నీచర్ ఎక్కువ లేదు. విశాలమైన మంచం, ఒక టీపాయ్, ఒక కుర్చీ మాత్రమే ఉన్నాయి. టీపాయ్‌పై అందమైన పింగాణీ పాత్రలు, గదినిండా వంటకాల ఘుమఘుమలు. పాతకాలపు సినిమాల్లో మనిషిలాగా నైట్‌గౌన్ వేసుకున్నాడు. వెండిరంగులో మిలమిలలాడే జుట్టు, పొడవాటి మిలటరీ మీసాలు. "మీరు నా ప్రత్యేక అతిథి," అని ఆహ్వానించాడు. ఆ రాత్రి ఆమెకో మరపురాని జ్ఞాపకం. ఆమె ఉల్లాసంగా, ఆనందంగా, తీవ్రమైన ఉద్వేగానికి లోనయింది. అతని గొంతు ప్రత్యేకంగా వాయిద్యం ఏదో మోగుతున్నట్లుగా. అతని కబుర్లు వింటుంటే సంగీత గమకాల్ని వింటున్నట్లు అనిపించింది. తన డైరీ అంటూ బ్రెయిలీ లిపిలో ఉన్న పుస్తకాన్ని చూపించాడు. అందులోంచి ఎన్నో ముఖ్య మైన పేరాలను ఆమెకు చదివి వినిపించాడు. అతను తీసిన ఫొటో లన్నీ గుట్టలుగా ఆమె ముందు పోశాడు. "ఇవి ఫోటోలు కాదు, ప్రవచనాలు. భవిష్యత్ గాథలు," అన్నాడు. ఆ ఫోటోలన్నీ చీకటిగా, అసంపూర్ణంగా ఉన్నాయి. ఆ మాటే అతనితో అంది. "అవును, ప్రపంచమంతా దుఃఖమే. ముగింపుకు దగ్గరగా వుంది," అన్నాడు.

రేడియోలో వార్తలు వింటున్నట్లుగా ఉన్నాయి అతని మాటలు. అతను భోజనం చేస్తున్న తీరు, ఆమెకు ఆశ్చర్యం వేసింది. ఆమె సహాయం లేకుండానే, తనే వడ్డించుకున్నాడు. ఫిష్, ప్రాన్స్ ఆ వంట కాల్ని ఆమె ఎంజాయ్ చేసింది. చివరగా రెడ్‌వైన్ బాటిల్ తీసి, "నిద్రలో మంచి కలల కోసం ఇది అవసరం," అంటూ. కలలు కలలుగా గడిపింది ఆ రాత్రి ఆమె. ఆమె వెళ్లేముందు ఆమె ఫొటో తీస్తానన్నాడు. ఫ్లాష్ ఆమె ముఖం మీదే వెలిగింది. ఫొటోని ఆమె చేతికిచ్చి వివరించమన్నాడు. అందులో ఆమె ముఖం స్పష్టంగా లేదు. ముఖంపై పల్చటి నీడ ఏదో పరచుకున్నట్లుగా. ఫొటోలోని వివరాలు వినగానే గాఢంగా నిట్టూర్చాడు సత్య సుందరం. "మీరు దుఃఖంతో ఉన్నారు. దిగులుగా ఉన్నారు. తుఫానులో చిక్కుకున్న పడవలా అల్ల కల్లోలంగా ఉన్నారు," అన్నాడు. ఆమెకు ఊపిరాడనట్లుగా అయింది. అద్భుతాల్ని, దేవుణ్ణి నమ్మని ఆమెకు, భగవంతుణ్ణి దగ్గరగా చూసి నట్లుగా అనిపించింది. భయం భయంగా ఫొటోను చేతుల్లోకి తీసు కుంది. తన ముఖాన్ని కాకుండా మనసును ఫొటోగా తీసినట్లుంది. సత్యసుందరం ఆమె చేతిని ప్రేమగా నొక్కాడు. ఆ రాత్రి సత్య సుందరం ఆమెకో ఫ్రూట్‌కేక్‌ని బహుమతిగా ఇచ్చాడు. గాఢ నిద్రలో కలలు కంటున్న సరస్సు, చ్రిప్ చ్రిప్‌మంటూ పక్షుల కలవరింతలు, సరస్సును తన బాహువుల్లోకి తీసుకొని, తన శరీరం చుట్టూ కప్పుకొని నిద్రపోయింది. ఆ మరుసటిరోజు ఆమె నిద్రలేచేసరికి పదకొండు దాటింది. నిద్రలేస్తూనే ఆమెకు సత్యసుందరాన్ని చూడాలనిపించింది.

సత్యసుందరం రొమాంటిక్‌గా ముస్తాబయ్యాడు. పొడవాటి జుట్టుకు, నిగనిగలాడే నూనె రాసుకొని, పాతకాలపు కవుల మాదిరి జుట్టును వెనక్కు దువ్వాడు. గుబురు గెడ్డాన్ని సాపుచేసి, తెల్లటి లాల్చీ, పైజమా, గుండ్రటి కళ్ళద్దాలతో ఉన్నాడు. భుజానికి వేలాడుతున్న లెదర్ బాగ్. సుందరం ప్రకటించినట్లు ఆరోజు వాన రాలేదుగానీ, మబ్బులు కమ్మిన ఆకాశం, సూర్యుణ్ణి బహిష్కరించినట్లుగా ఉంది.





సుందరం పది కిలోమీటర్ల దూరంలో ఉన్న 'బాలూగావ్'కి, గైడ్ సాయంతో ఒరియా సినిమా చూడడానికి వెళుతున్నాడు. గుడ్డిమనిషి.. సినిమా చూడటం, ఆ ఆలోచనే వింతగా తోచింది ఆమెకు. "ఏ మంచి అనుభవాన్ని మిస్ కాదలచుకోలేదు, నేను" అన్నాడు సత్యసుందరం. అతనితో కలిసి సినిమా చూడడానికి వెళ్లాలని నిర్ణయించుకుంది ఆమె.

పురాతనమైన భవనంలా ఉంది ఆ సినిమాహాలు. హాలులో పదిమంది మనుషులు కూడా లేరు. వాళ్లు సీట్లలో కూర్చోగానే, ఏ హెచ్చరికా లేకుండా సినిమా మొదలైంది. ఆ సినిమా పేరు "మనో రంజన్ మహంతి భార్య కథ." వాళ్లిద్దరికీ ఒరియా రాదు. గైడ్ మీద నమ్మకం ఉంది. ఒక్క దృశ్యం కూడా వదలకుండా వివరిస్తున్నాడు. గైడ్‌కి తెలుగు వచ్చుగానీ, ఇంగ్లీషులోనే అనువదించమని అడిగాడు సుందరం. సినిమా కన్నా సుందరం ముఖంలోని ఉద్వేగాల్నే ఆశ్చర్యం గా చూస్తుంది ఆమె.

సినిమా టైటిల్స్ అన్నీ సన్నగా టైప్‌రైటర్‌పై టైపు చేసినట్లుగా ఉన్నాయి. వాళ్లలో ప్రముఖులెవరూ లేరు. దర్శకుడి పేరు సత్యజిత్ మహా పాత్ర. కొత్త దర్శకుడు అని చెప్పాడు గైడ్.

"ఒక బొంగురు గొంతు మనిషి నేపథ్యంలోంచి కథను మనకు వినిపిస్తున్నాడు. కథ ఫ్లాష్‌బ్యాక్‌కి, ప్రెజెంట్ అటూ, ఇటూ పరిగెడు తుంది. తెరపై ఇప్పుడు యాభైఏళ్ల మనిషి, దుఃఖంతో నిండిన గొంతుతో మాట్లాడుతున్నాడు."

గైడ్ వివరించే తీరు విసుగ్గా ఉంది ఆమెకు. "నా భార్య మరో మూడుగంటల్లో చనిపోతుంది"- తెరపై యాభై ఏళ్ల మనిషి. గైడ్ మాటల్ని పట్టించుకోకుండా, తెరపైని దృశ్యాలను చూడాలని ఆమె ప్రయత్నిస్తోంది. గైడ్ క్షణం కూడా ఆపకుండా సినిమాని వివరిస్తు న్నాడు. "దక్షిణ ఒరిస్సాలోని చిన్న గ్రామం. ఊరి చివరన ఉన్న మేడ. అందులో చనిపోవడానికి సిద్ధంగా ఉన్న ఆడమనిషి. వయసు పెద్దగా

లేదు. యాభయ్యో అంతకు తక్కువో. ఎదురుగా మహానది. నది నిండా వందలుగా పడవలు. పడవలు స్లోమోషన్‌లో కదులుతూ, పడవలపై తెల్లటి కొంగలు బారులు బారులుగా ఎగురుతూ. నాకు ఐస్‌క్రీమ్ తినాలనిపిస్తోంది. అంటుంది పక్కన కూర్చున్న భర్తతో. తెరపై వాళ్లిద్దరే. మనోరంజని, ఆమె భర్త. ఇద్దరూ... ఒకళ్లనొకళ్లు చూసు కుంటూ, ముప్ఫయి ఏళ్ల జీవితాన్ని గుర్తు చేసుకుంటూ".

"మనమిప్పుడో ఫ్లాష్‌బ్యాక్‌ని చూస్తున్నాం. వాళ్లిద్దరి గతాన్ని చూపిస్తున్నారు" అన్నాడు గైడ్.

పాతికేళ్ల మనోరంజని. పొగరుగా, విశృంఖలంగా. ఆ పక్కనే నడుస్తున్న మహంతి. ఆమె కనుసన్నలలో నడుస్తూ, ఆమెను ఆకర్షిం చాలని. తన కలల నిండా, మనసునిండా ఆమే ఉందని వివరించ డానికి ప్రయత్నిస్తున్నాడు. ప్రేమించడం, వెంటబడటం మగవాళ్ల జన్మ లక్షణం అంటుంది మనోరంజని. "మగవాళ్లు మదమెక్కిన జంతువు ల్లాంటివాళ్లు. కోరిక తీరే వరకే ఈ ప్రేమలు, వెంటబడటాలు" అంది. అతను "నా ప్రేమ నిజమైంది. భగవంతుని ఉనికిలాంటిది" అని ఆమెను అర్థిస్తాడు. వెంటబడతాడు. రెండు రేళ్ల పాటు, ఈ వెంట బడటాలు అయిపోయాక, చివరకు ఆమె పెళ్లికి ఒప్పుకుంటుంది.

దగ్గరనే ఉన్న టౌన్‌లో అతని ఉద్యోగం. ఆమెకు పిల్లలంటే ఇష్టం. "పిల్లలు వద్దు మనకు" అంటాడు అతను. "పిల్లలు పుడితే నీ అందం మాయమవుతుంది. నువ్వు ముసలిదానివవుతావు. ఎప్పటికీ నువ్వు మనోరంజనిలా ఉండిపోవాలి" అంటాడు. ఆమె అంగీకరి స్తుంది. పిల్లలు పుట్టకపోయినా, ఆమె తన వయసు మార్పుల్ని ఆప లేకపోతుంది. చెంపలు నెరుస్తాయి. జుట్టు పలచబడుతుంది. చెక్కిళ్ల పైని నునుపు తగ్గిపోతుంది. శరీరం వదులవుతుంది. "నీలోని మార్మిక శక్తి ఎగిరిపోయింది. నువ్విప్పుడు మామూలు ఆడదానివి" అంటాడు. అతను క్రమంగా, ఆమె నుంచి దూరమవుతాడు. ఒక్కతే, ఆ ఇంట్లో ఇరవై ఏళ్లకు పైగా గడుపుతుంది, గదిలో తనకు తాను బంధించుకొని.





అతను ఆ ఇంటిని, ఆమెను మరిచిపోతాడు. అతనికెంతమందో ప్రియురాళ్లు. ఎఫైర్స్, జుట్టుకు రంగు వేసి, రంగురంగుల చొక్కాలు వేసి, వయసును జయించాలనుకుంటాడు. తన యాభయ్యవ జన్మ దినాన, పాతికేళ్ల అమ్మాయితో హనీమూన్ జరుపుకొంటుండగా భార్యకు సీరియస్ అని కబురు వస్తుంది. అతనా వార్తను పట్టించు కోడు. ఆ రాత్రి ఒక వింత జరుగుతుంది. ప్రియురాలితో నగ్నంగా మంచంపై పడుకున్న సమయంలో అతని శరీరంపై హఠాత్తుగా ముడతలు వస్తాయి. శరీరం, జంతు శరీరంలా నల్లగా, మందంగా మారిపోతుంది. ముఖం కాంతిహీనంగా పాలిపోయి, ఒక్కసారిగా అతనిలో ముసలితనం వస్తుంది. పక్కనే పడుకున్న అమ్మాయి, భయంతో అరుస్తూ పారిపోతుంది.

''మనం మళ్లీ 'ప్రెజెంట్'లోకి వచ్చాం. ఫ్లాష్‌బ్యాక్ అయిపోయింది,'' అన్నాడు గైడ్.

మనోరంజని భర్త నిర్మానుష్యమైన వీధుల్లో భార్య అడిగిన ఐస్‌క్రీం కోసం తిరుగుతుంటాడు. షాపులన్నీ మూసివేసి ఉన్నాయి. మనోరంజని కిటికీ అద్దంలోంచి మహానది వైపే చూస్తుంటుంది. నది ఒడ్డునే... వాళ్లిద్దరూ, ప్రేమగా ఒకరి భుజాలపై ఒకరు వాలి నడుస్తున్న దృశ్యం. అప్పుడు, ఇలాగే ఐస్‌క్రీమ్ తెచ్చిపెట్టమని అడుగుతుంది. ఆమెను నది ఒడ్డునే వదిలేసి ఐస్‌క్రీమ్ కోసం పరిగెత్తిన క్షణం గుర్తుకొస్తుంది. ఆమె నదివైపు అట్లా అనిమేషంగా చూస్తుండగా, అతను ఐస్‌క్రీమ్ కోసం వీధుల్లో పరిగెత్తుతుండగా... సినిమా అయిపోతుంది.

సినిమా హాలు నుండి బయటకు నడుస్తుండగా, సత్య సుందరం, ''సినిమా పూర్తవలేదు. ఇంకో సన్నివేశం మిగిలి ఉంది,'' అన్నాడు, గంభీరమైన తన ప్రవక్త స్వరంతో. ''ఐస్‌క్రీమ్ తెచ్చేసరికి, ఆమె చనిపోయి ఉంటుంది. అతనామె ముందు కూలబడి, పెద్దగా ఏడుస్తూ 'మనోరంజనీ, ఐస్‌క్రీమ్ తెచ్చాను. కళ్లు తెరు. మనం మళ్లీ

కొత్తగా ప్రేమను మొదలుపెడదాం. నాకు మరో అవకాశం ఇవ్వు,' అని ఏడుస్తాడు. దుఃఖంతో కిటికీకి తలను పదేపదే బాదుకొని, తల చిట్లి, పగిలిన కిటికీ అద్దాలు కళ్లలో గుచ్చుకొని! అతని ముందున్న నది అదృశ్యం అవుతుంది. అతని సమస్తమైన రంగుల ప్రపంచం అదృశ్యమవుతుంది'' అన్నాడు కళ్లజోడును తీసి, కంటి చుట్టూ వున్న చెమ్మను తుడుచుకుంటూ.

ఆ రోజంతా సత్యసుందరం ఆమెకు కనిపించలేదు. అతని కాటేజి వైపు రెండు మూడుసార్లు వెళ్లింది. మూసిన తలుపుల్ని చూసి, నిరాశగా వెనక్కు వచ్చింది. సరస్సు ఒడ్డున ఒక్కతే కూర్చుంది, సరస్సు పైన నీలి రంగు మిలమిలల్ని చూస్తూ. ఆ సాయంకాలపు సరస్సు ఆమెను ఉద్రూత లూగించ లేకపోయింది. సరస్సు లోతుల్లో దాక్కున్న నల్లనల్లని రూపాలేవో హఠాత్తుగా పైకి ఎగిసి వస్తాయని ఒక భయం. ఆ నల్లనల్లని రూపాలు ఏమిటవి? ఆమె ఒంటరితనం, ఆమె మనసు, ఆమె దేహం. తగలబడుతున్న ఆమె దేహం.

చీకటి పడింది. ఆమె సరస్సు ఒడ్డునే కూర్చుంది. సరస్సు పైనుంచి చల్లని గాలులేవో వీచి, ఆమె శరీరానికి కొంత ఉపశమనం గా ఉంది. చీకటి పడగానే గుంపులుగా కుర్రవాళ్లు సరస్సు చుట్టూ మూగారు. కాంప్ ఫైర్ వేశారు. కేకలు, అల్లర్లు, పాటలు. వాళ్ల పాట లకు సరస్సు కూడా మత్తుగా అలల తలలూపుతున్నట్లుగా అనిపిం చింది. ఆ పాటల సందడికి, సత్యసుందరం అక్కడికి చేరాడు. సత్య సుందరాన్ని చూస్తూనే ఆమెలో కదలిక వచ్చింది. మనసు నిండా ఆహ్లాద పరిమళం. వచ్చి సత్యసుందరం పక్కన కూర్చుంది. ఆమె ఉనికిని గుర్తు పట్టినట్లుగా ''రండి, రండి'' అని పలకరించాడు.

సత్యసుందరం గొంతెత్తి ఒక ఇంగ్లీషు పాటను అందు కున్నాడు.

"I cry the whole night through; cry me a river,
because I cried the river for you"





సరస్సు, అతని పాటకు పరవశించినట్లుగా, సరస్సులోని అలలు ఉద్రేకపడ్డాయి. డ్రమ్ బీట్స్ మోగినట్లు, వేయి వేణువులు ఊదినట్లు, అలలు ఘోషించాయి.

ఆ పాటల సందడి వేకువజాము వరకూ సాగింది. సత్య సుందరం, "విత్ యువర్ పర్మిషన్" అంటూ జేబులోంచి స్కాచ్ సీసా తీశాడు. స్కాచ్ తరువాత, పాటల్లో హుషారు పెరిగింది. వేకువ జామున అతిపెద్ద కేక్‌ను బయటకు తీశారు. సరస్సులోంచి జన్మించ బోయే ఒక కొత్త ఉదయం కోసం సూర్యుడు సరస్సు గర్భంలోంచి బయటకు ఉబుకుతున్న వేళ. ఒక్కసారిగా డ్రమ్స్, గిటార్లతో ఆ ప్రదేశాన్ని నాదమయం చేసి, సరస్సు ముఖంపై పల్చటి వెలుగు విప్పు కుంటున్న వేళ, చప్పట్ల మధ్యన కేక్‌ని కోశారు. ఎంత మధురమైన క్షణాలివి. సత్యసుందరం మరో పాట అందుకున్నాడు.

"I believe I can fly
I beleive I can search the sky"

ఆ ఉదయపు వేళ, ఆమెలో ఒక పులకరింత, ఒక సంచలనం కలిగాయి. ట్రాన్స్‌లోకి వెళ్లినట్లుగా, ఆనందంతో అరిచింది. కేరింత లాడింది. పక్కనే ఉన్న సత్యసుందరాన్ని కౌగిలించుకొని, అతని చెక్కిళ్లపై గట్టిగా ముద్దుపెట్టుకుంది. అతని బలమైన చేతుల్ని తన ఛాతీపై హత్తుకుంది. వాకింగ్ స్టిక్ వెతుక్కుంటున్న సత్యసుందరాన్ని తన చేతుల్లో పొదువుకొని రూమ్ వరకూ తీసుకెళ్లింది. సత్యసుందరం ముఖంలోని భావాల్ని చదవాలని చూసింది. అతని ముఖం, ఎప్పటి లాగే, ప్రవక్తల ముఖంలాగ గంభీరంగా, కదలికలు లేనట్లుగా.

ఆ మధ్యాహ్నం సరస్సులోకి విహారానికి వెళుతూ, సత్య సుందరాన్ని రమ్మని అడిగింది. సత్యసుందరం కాదనలేదు. 'బర్డ్స్ ఐలాండ్' వైపు బయల్దేరారు. ఆరోజు సూర్యుడు సరస్సు పొడవునా వెలుగుల నాట్యం చేస్తున్నాడు. కొద్ది దూరం వెళ్లగానే ఫ్లెమింగోలు దర్శనమిచ్చాయి. వాటి విన్యాసాల్ని అతనికి వివరించి చెబుతోంది. పడవ అలికిడికి, ఉలిక్కిపడి, అంతలోనే సర్దుకొని, ఒక్కసారిగా పైకి

లేచి, విశాలమైన రెక్కల్ని విప్పి, అవన్నీ రెక్కలు విప్పి ఎగురుతుంటే దేవలోకపు పక్షుల్లా అనిపించడం.. అతనికి వివరించింది. అతని కెమెరాను ఆ పక్షులవైపు తిప్పి, ఆ ఫోటోలోని ఫ్లెమింగోలు బంగారు రంగులో మిలమిలలాడుతూ 'డివైన్స్ డాన్స్' లా కనిపించటం అతనికి వివరించింది. మొదటిసారి సత్యసుందరం ముఖంలో తన్మయత్వం లాంటి భావాన్ని చూసింది.

తీరం దగ్గరయ్యేకొద్దీ సరస్సునిండా, మైళ్ల పొడవున తుంగ మొలిచి ఉంది. ఆ తుంగవనాల్ని అల్లుకొని ఆకుపచ్చని ఆల్గీలు. వనాల చుట్టూ వేలాది చేపపిల్లలు... షికార్లు చేస్తూ. పక్షుల చప్పుళ్లు విని, నీటి అడుగుకు పరిగెత్తి, ఆ దృశ్యాన్ని వివరిస్తుంటే సత్యసుందరం ముఖం కాంతితో వెలిగింది.

ఆ తుంగవనాల మధ్య కాసేపు పడవను ఆపారు. ఆకుపచ్చని నీళ్లలోకి చేతులు పెట్టింది. నీళ్లు అరచేతుల్ని ముద్దు పెట్టుకోవటం ఆమెకు తెలుస్తోంది. నిశ్చలంగా ఉన్న పడవ చుట్టూ వందలాది పక్షులు మూగాయి. నల్లటి గుంపులాగా వాళ్ల చుట్టూ మూగి, నల్ల నల్లటి మరకల మధ్య వాళ్లు, పడవ అదృశ్యమయినట్లుగా.

పడవ 'కాళీజై' వైపు వెళుతుండగా సన్నటి వానజల్లు మొద లైంది. చేతుల్ని రెంటినీ పైకెత్తి, వానజల్లుల్ని కౌగిలించుకోవాలని చూస్తోంది ఆమె. సత్యసుందరం నీళ్లలోకి చేతులు పెట్టి, అలలతో సంభాషిస్తున్నాడు. వాన క్రమంగా పెద్దదైంది. పడవ వేగాన్ని పెంచారు. వానలో పూర్తిగా తడిసిపోయి వాళ్లు కాళీజై వెళ్ళారు. కాళీజై... సరస్సు మధ్యలోని ఎత్తైన రాళ్లగుట్ట, కొండ. కొండపై చాలా ఏళ్ల క్రితం కాళీజై అనే దేవత గుడి ఉంది. వీళ్లు అక్కడకు చేరేసరికి, అక్కడ చాలామంది టూరిస్ట్‌లు చేరారు. గుడి ముందర స్నానాలు చేసి, గుడి లో పూజలు చేస్తూ, సత్యసుందరాన్ని నడిపించుకు వెళ్లి, ఒక ఎత్తైన రాళ్ల గుట్టపై కూర్చొపెట్టింది. ఆమె సరస్సు ఒడ్డునే ఒక సిమెంటు మెట్టు పై కూర్చుని, నీళ్లలో కాళ్లు పెట్టుకొని ఉంది. ఈ కాళీజై ప్రదేశం





ఆమెకెంతో ఇష్టం. ఆమె భర్త ఇక్కడకు వచ్చినప్పుడల్లా, దేవాలయం లో ప్రత్యేక పూజలు చేసేవాడు. ఈ ప్రదేశాన్ని చూసినప్పుడల్లా భర్త గుర్తుకు వచ్చేవాడు. నుదుటిపై పొడవాటి కుంకుమ బొట్టు పెట్టు కొని, పూలు, టెంకాయతో గుడిలోంచి బయటకు వస్తున్న అతని రూపం కళ్లముందు మెదిలింది. గుండెనొప్పితో విలవిలలాడే వేళ, అతను ఈ గుడివైపు తిరిగి ప్రాణాలకోసం దీనంగా ప్రార్థించిన క్షణాలు గుర్తుకొచ్చాయి.

ఆ జ్ఞాపకాల్లోంచి మరలి, పక్కకు చూసింది. ఎత్తైన రాతిపై బుద్ధుడిలా కూర్చున్నాడు సత్యసుందరం.

అతని చుట్టూ పసుపుపచ్చని పూలచెట్ల గుబురు. ఆ చెట్ల మధ్యన అతను పూలకిరీటం ధరించిన వాడులా ఉన్నాడు. అతనితో పరిచయం ఆమెకింకా ఆశ్చర్యంగా ఉంది. భర్త చనిపోయినాక ఆమె మరే మగవాడి గురించి ఆలోచించలేదు. ఒక ప్రైవేట్ కంపెనీలో సీనియర్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్న తారకు ఈ సత్యసుందరం అసాధారణమైన వ్యక్తిలా కనిపించసాగాడు. 'మిస్టిక్ పర్సన్ ఈ సత్య సుందరం' అనుకుంది ఆమె.

సత్యసుందరంతో పాటు కొండ దిగి పడవ వైపు వెళుతుండగా ఒక ఆశ్చర్యకరమైన సంఘటన జరిగింది. పడవలోకి కాలు పెడు తుండగా, ఒక సవర స్త్రీ ఆమె చీరను పట్టుకొని లాగింది. నల్లటి శరీరం, నలుపు రంగు కళ్లు. పొట్టిగా, లావుగా ఉంది. ఆమె కొంగులో నెలల శిశువు. శిశువు చుట్టూ ఈగలు ముసిరి ఉన్నాయి. నల్లగా ఉన్నా, వింత వెలుగు దాని ముఖంలో. ఆ స్త్రీ ఆమెను దీనంగా అర్థిస్తోంది. పర్సులోంచి వంద రూపాయల నోటు తీసి ఆమెకు ఇచ్చింది. సవర స్త్రీ ఆ డబ్బుల్ని తీసుకోలేదు. పొత్తిళ్ళలోని బిడ్డను తీసి, ఆమెకు ఇవ్వడానికి ప్రయత్నించింది. ఆమె కంగారుపడింది. పర్సులోంచి మరి కాసిని నోట్లు తీసి ఇచ్చింది. సవర స్త్రీ 'ఈ బిడ్డను తీసుకో,' అన్నట్లుగా బిడ్డను ఆమె చేతుల్లో వదిలి పారిపోయింది.

జారవిడుచుకున్న వరంలా ఆ శిశువు వైపు, సవర స్త్రీ వైపు చూస్తూ ఉండిపోయింది. గైడ్, అక్కడ ఉన్న మరికొంతమంది టూరిస్టులు.. సవర స్త్రీని ఆపి బిడ్డను మళ్ళీ తిరిగి ఇచ్చేశారు. ఆమె నివ్వెరపోయి చూస్తోంది. పడవ బయలుదేరింది. గాయపడిన ఫ్లెమింగో ఒకటి నీటిపై తేలియాడుతోంది. నీళ్లన్నీ ఎర్రగా మారాయి.

సాయంత్రం ఆరు గంటలకు వాళ్లు కాటేజీలకు చేరారు. ఆ రాత్రి తన కాటేజీలో డిన్నర్‌కు రమ్మని సత్యసుందరాన్ని ఆహ్వానించింది. ఎనిమిది గంటల వేళ, గైడ్ సాయంతో ఆమె కాటేజీకి వచ్చాడు సత్యసుందరం. కాళీజై కొండలపై నడిచి, అతని పాదాలకు బొబ్బలు లేచాయి. బరువుగా నడుస్తున్నాడు. వాళ్ళిద్దరూ కాటేజీ బయట కూర్చున్నారు. సరస్సుపై ఎగురుతున్న రెక్కల మృగం ఫ్లెమింగో గురించి అతనికి వివరించింది. సరస్సుపై ఫ్లెమింగో పక్షుల రెక్కల చప్పుడు వినిపిస్తూనే ఉంది. ''రాత్రి చిక్కబడినాక, ఫ్లెమింగోలు నీటి ఒడిలోకి ఆత్మల్ని జార విడుస్తాయి. ఉదయానికి ఆత్మలు మొలకెత్తినట్లుగా పునరుత్థానం చెందుతాయీ పక్షులు,'' అందామె. సత్యసుందరం ఆ పక్షుల చప్పుళ్ళు వినిపిస్తున్న వైపు ఆరాధనగా చూశాడు.

ఆమె అతన్ని నడిపించుకొని కాటేజీలోకి తీసుకెళ్ళింది. అతని పాదాలకున్న బొబ్బల నుంచి రక్తం కారి, అతను నడిచినంత మేరా ఫ్లోరింగ్‌పై రక్తపు మరకలయ్యాయి.

సత్యసుందరం బెడ్‌పై కూర్చున్నాడు. అతని పాదాలకు మందు రాస్తూ, తన గురించి కబుర్లన్నీ అతనికి చెప్పింది. సత్యసుందరంతో పరిచయం... ఆమె జీవితంలో ముఖ్యమైన సంఘటన అని చెప్పింది. ''కలిసి జీవిద్దాం,'' అంది హృదయపూర్వకంగా. అలా అంటూ, మృదువైన తన చేతులతో అతన్ని చుట్టుముట్టింది. సత్యసుందరం ప్రతిఘటించలేదు. బయట పక్షుల కువకువలు, కేరింతలు. ఒక మహా సముద్రం ఉప్పొంగినట్లుగా ఆమె, శాంత గంభీరంగా అతను. విశృంఖలమైన కలల్లా వాళ్లు పెనవేసుకున్నారు. గొప్ప





కాముకత్వంతో వాళ్ళు వెలిగిపోయారు. తన జీవితంలోకి ప్రవేశించమని సత్యసుందరాన్ని అర్థించింది ఆమె. కథలో ప్రేమికుల్లా ఉండిపోదామని ఊరించింది. సత్యసుందరం ఏమీ మాట్లాడలేదు. ఆ రాత్రి ఆమె సముద్రమైంది. వెన్నెలైంది. అలవికాని మోహమైంది. ఆమె దేహంపై వందలాది 'ఆర్గాజమ్'లు నాట్యం చేశాయి.

ఆనందంతో, వివశత్వంతో ఆమె నిద్రపోయింది. నిద్ర లేచేసరికి, సత్యసుందరం పక్కన లేడు. సత్యసుందరాన్ని పిలిచింది. బదులు లేదు. కాటేజీ అంతా నిశ్శబ్దం. మంచం పై నుంచి లేస్తుండగా, దిండు కింద తెల్లటి కవర్. కవర్ తెరిచి చూసింది. ఛిన్న మస్క దేవత ఫోటో. ఖండించిన తన శిరస్సును ఒక చేతిలో పట్టుకుని నిలబడ్డ అమ్మవారి ఫోటో.

సరస్సు ఒడ్డున గుంపులుగా జనం. గొడవగొడవగా ఉంది. ఒడ్డున ఒక టూరిస్టు శవం.

బయట, సరస్సుపై ఫ్లెమింగోలు విహ్వలంగా అరుస్తున్నాయి. అవి తిరిగి వెళ్లిపోవాల్సిన కాలం వచ్చేసింది.

ఆమె ఉన్న కాటేజీ బయట మెట్లపై సవర స్త్రీ, ఆమె ఒడిలో శిశువు.

ఆమె రాక కోసం ఎదురుచూస్తూ సవర స్త్రీ;

ఒక కొత్త ప్రపంచం కోసం ఎదురుచూస్తున్నట్లుగా, ఆమె చేతుల్లోని శిశువు విప్పారిన కళ్ళతో ప్రపంచాన్ని చూస్తూ, చేతులు గాలిలో ఊపుకుంటూ;

*విపుల, ఆగస్టు 2009*